


# మెతక మనిషి

వడ్డమన్నాటి లక్ష్మీప్రసన్న

కృష్ణమోహన్ శ్రీమతి సత్యప్రియ ఊరెళ్ళింది. ఇవాళ్టికి రెండు రోజు లయింది. ఆమె తిరిగి రావటానికి ఇంకా అయిదు రోజులు గడువుంది. వెళ్ళే టప్పుడు మరీ మరీ చెప్పివెళ్ళింది సత్య ప్రియ. "మీ కసలే నోట్లో నాలుక లేదు గదాని పక్కపోర్షను లోని నీరజతో.... మావారిని గురించి కాస్త పట్టించుకుంటూ ఉండమని పదే పదే చెప్పాను. ఆమె సరే నంది - 'వారి సంగతి నేసు చూసు కుంటాగానీ.. మీరు క్షేమంగా వెళ్ళి లాభంగా తిరిగి రండి-అక్కయ్యగారూ' అంది ఎంతో ఆప్యాయంగా. ఏమన్నా కావాలంటే ఆమె నడగండి-సందేహించ

కుండా. మీ డిగ్నిటీకి ఏం భంగం రాదు. హోటల్లో చెత్త తినకుండా - గాస్ స్టవ్ మీద వంట - కాఫీ టిఫిను - చేసుకోండి. నేను లేను గదాని మీ యిష్టమొచ్చినట్టుగా సినిమాలు చూసినా... స్నేహితులతో చెక్కార్లు కొట్టినా, నే నూరుకోను! ఆఫీసయిపోగానే .... బుద్ధిమంతుడిలా ఇంటికొచ్చేసెయ్యండి! మీకు కాలక్షేపానికి .... 'చింటూ' ఉండనే వున్నాడు. నేను రాగానే మీ మీద సి. ఐ. డి. రిపోర్టు నీరజ నడుగుతాను. తెలిసిందా!" అని.

అందం.... లావణ్యం.... మూర్తీభవించిన సత్యప్రియ ఓనరలా డామినేట్ చెయ్యటమంటే కృష్ణమోహన్‌కి చాలా ఇష్టం అందుకని గుడ్‌బాయ్‌లా తల ఊపాడు. ఆమె అందుకు తియ్యని ము....లు మూడు బహుమానంగా ఇచ్చి-

"తప్పనిసరయి వెడుతున్నాను .... లేకపోతే నాకుమాత్రం ఇష్టమా? చెప్పండి? రాగానే శ్రీవారి విరహాన్ని చక్రవడ్డీతో సహా తీరుస్తాగా?" అని అభయమిచ్చి వెళ్ళిపోయింది.

ఊరికే ఇంట్లో కూర్చోవటం బోరు గానే వున్నా.... ప్రియ భార్యామణి కిచ్చిన మాటకోసం ఎక్కడికీ కదల లేదు కృష్ణమోహన్.

పత్రికలు.... రేడియో.... టైం కిల్లింగ్‌కు బాగానే ఉపయోగపడ్తున్నా.... ఆ వెలితిని ఎక్కువభాగం తీర్చేది 'చింటూ!'

'చింటూ' అసలు ముద్దు పేరు 'చంటి!' నీరజ కా పేరు మోటుగా అనిపించి 'చింటూ' అని మార్చింది హిందీ సినిమాలు ఎక్కువగా చూసే అలవాటుండటంవల్ల. నీరజ భర్త రఘు దానికేమీ అభ్యంతరం తెలుప లేదు. రఘు ఏదో పెద్ద కంపెనీలో సేల్స్ రిప్రజెంటేటివ్‌గా పని చేస్తున్నాడు. జీతం బాగానే వస్తుందిగానీ ఇంటి దగ్గర ఉండటం తక్కువ. నెలలో కనీసం పదిహేను ఇరవై రోజులయినా క్యాంపు లుంటుంటాయి.

క్యాంపు లేనప్పుడు మాత్రం భార్యనీ... చింటూనీ ఒక్క నిముషం కూడా వదిలి ఉండడు. వారిద్దరంటే అంత మక్కువ అతనికి.

కృష్ణమోహన్, రఘుండి ఓహో అంటే ఓహో అనుకునే స్నేహమేగానీ ... సత్యప్రియ....నీరజలు మాత్రం ప్రాణస్నేహితురాళ్ళయిపోయారు. ఆమె మాటే ఈమె మాట! ఈమె మాటే ఆమె మాట! అందుకనే కృష్ణమోహన్‌ని కాస్త కనిపెట్టి ఉండమని సత్యప్రియ చెప్పగానే చటుక్కున ఒప్పుకుంది నీరజ. ఆ సమయంలో....ఆమె ముఖంలో లీలగా కనిపించిన వెలుగుని సత్యప్రియ అంతగా గమనించలేదు.

మాట నిలబెట్టుకుంది నీరజ! రఘు

కాంపులో ఉన్నాడేమో.... ఆమె కు క్షేమం కూడా ఎక్కువగా మిగిలింది. అందువల్ల కృష్ణమోహన్‌కి ఏమన్నా కావాలేమో ననుకుని చీటికి మాటికి కనుక్కొంటం మొదలుపెట్టింది .... మొదటి రోజున కాఫీ.... టిఫిన్.... తీసుకొచ్చి ఇచ్చింది. కృష్ణమోహన్ వద్దంటున్నా వినకుండా.... బలవంతంగా అక్కడ పెట్టి వెళ్ళిపోయింది. తీసుకోక తప్పలేదు. పైగా చింటూతో రికమెండ్ చేయించింది! వచ్చీరాని మాటలతో 'కిట్నా'గారూ అంటాడు అతన్ని చింటూ. "కిట్నాగారూ! కిట్నాగారు! మా అమ్మ పెట్టింది తీసుకో మంటోంది.... లేకపోతే.... మమ్మల్ని కొడుతుంది!" అన్నాడు. ఆ ముద్దు మాటలకి ముగ్ధుడై పోయి కొంచెం ఉప్మా అతనికి పెట్టి తను మిగతాది తినేసి కాఫీ తాగేశాడు.

నిన్న, ఇవ్వాళ అన్నం ఒక్కటి తప్ప ఏమీ వండుకో నివ్వ లేదు నీరజ. కూరలు.... సాంబారు.... అన్నీ తను చేసినవే తెచ్చి యిచ్చింది. కొన్నిటిని చింటూతో పంపింది.

"మీరిలా మొహమాట పెట్టేస్తే ఎలా?" అన్నాడు కృష్ణమోహన్ - విడియంగా ఆమెకేసి చూస్తూ. ఇవాల్టికీ నిన్నటికీ ఆమెలో మార్పు గమనించాడు కృష్ణమోహన్. అలంకరణ పాలు కాస్త ఎక్కువగా కనుపించింది. "ఆడవాళ్ళు అలంకారప్రియులు," అని సరిపెట్టు కున్నాడు.

ఈ సాయంత్రం అంతా చింటూతో కబుర్లతో హాయిగా గడిచిపోయింది. ఇంతకు ముందే తన దగ్గర నుంచి వెళ్ళాడు చింటూ.

వాచీ చూసుకున్నాడు కృష్ణమోహన్. రాత్రి తొమ్మిది గంటలయింది. తలుపు చప్పుడయితే.... ఇంత రాత్రి పూట తనని డిస్టర్బ్ చేసే స్నేహితులెవరబ్బా! అని విసుక్కుంటూ వెళ్ళి తలుపు తీశాడు.

అంతే! నిలువెల్లా ఆశ్చర్య పోయాడు.

ఎదురుగా నీరజ!

అందాల అప్సరసలా....

సోయగాల సొగసులు విరజిమ్ము తోంది!

వింతకాంతు లీనుతున్న ఆమె అందం మత్తెక్కిస్తుంటే.... ఆమె అలంకరణ కైపెక్కిస్తోంది.


"ఏం కావాలి?" తడబడుతూ అడిగాడు.

"చింటూ...." అంది పంటితో పెదవి నొక్కిపట్టి - సమ్మోహనంగా చూస్తూ.

"చింటూ మీ దగ్గరికే వచ్చాడుగా, గంట క్రితం."

"ఆ మాట కాదని నేనంటం లేదుగా?" కిసుక్కున నవ్వింది. ఆ నవ్వులో వెక్కిరింపు కూడా వుంది.

"మరి?"



"చింటూ జేబులో బంగారు లాకెట్ ఉండాలి. ఇందాక వెతికితే కనిపించ లేదు. ఇక్కడేమన్నా పడేసుకున్నాడేమో నని...." కళ్ళు అందంగా తిప్పింది.

"ఏమిటేమిటి? ఇప్పుడు వెదుకుతా నంటుందా ఏమిటి? కొంప దీసి...." కృష్ణమోహన్‌లో ఏదో తెలియని పిరికి తనం ఆవేశించింది.

"ఏమిటండీ! నన్నిక్కడ ఇలాగే నిలబెట్టేశారు. కాస్త వెతుక్కోనివ్వండి! మా చింటూ లాకెట్ కాకుండా మీ సొమ్మేమయినా ఎత్తుకుపోతానని భయంగా వుందా?" మళ్ళీ నవ్వింది గలగలా.

అనుకున్నదంతా అయింది అనుకున్న కృష్ణమోహన్ సభ్యతగా ఉండదనుకుని కొంచెం తొలిగి దారి ఇచ్చాడు- బెరుకు బెరుకుగానే.

అలవోకగా తగిలినట్లు కృష్ణమోహన్‌ని రాసుకుంటూ వెళ్ళింది నీరజ. ఒళ్ళు జల్లు మందతనికి. తను పొరపాటు పడుతున్నాడేమో అనుకుని సర్దుకున్నాడు. కాసేపు అటూ ఇటూ చూసింది నీరజ. చూసినంతసేపూ ఏవో ప్రశ్నలు వేస్తూనే వుంది. తప్పనిసరి సమాధానాలు చెపుతున్నాడు కృష్ణమోహన్.

"ఈ మంచంకింద పడిందేమో? మీరు కూడా కాస్త సాయంచేయండి!" అంది తను దానికింద దూరి.

అలాగే నిల్చున్నాడు కృష్ణమోహన్.

"మరదలికి సాయంచేస్తే తప్పులేదు లెండి!" అంది చూపులతో కవ్విస్తూ.

"అబ్బే! అదేం లేదు" అంటూ తనూ దూరాడు. కృష్ణమోహన్- బాగుండదనుకుని.

సాధ్యమైనన్నిసార్లు తన శరీరాన్ని కృష్ణమోహన్‌కి తగిలించింది నీరజ.

ఆ సుకుమార స్పర్శకి... కృష్ణ మోహన్‌లో ఏవో చిలిపి కోరికలు తలెత్తుతున్నాయి.

నిగ్రహించుకోవటం కష్టంగా వుంది.

ఉన్నట్టుండి అంది నీరజ. "ఇదుగో లాకెట్" ఆనందంగా అరిచింది.

"ఎక్కడుంది?" కృష్ణమోహన్ ఆశ్చర్యపోయాడు.

"ఇదుగో! ఈ కోడుకింద ఉంది"

"గుడ్! చింటూకి పెట్టండి" తన అనుమానాన్ని పైకి వెలిబుచ్చకుండా అనేశాడు.

"మిరోసారి మా యింట్లోకి వచ్చి మీరే చెయ్యండి ఆ పని" ఆహ్వానించింది.

"సరే పదండి" కృష్ణమోహన్ బుర్ర పదునెక్కింది.

"థాంక్యూ!" ఆమె వేగంగా తన పోర్షనులోకి వెళ్ళింది.

కృష్ణమోహన్ కూడా సంతోషంగా తలుపు దగ్గిరికి వెళ్ళాడు. అతనిలో ఆలోచనా తరంగాలు ఉవ్వెత్తున లేచి పడుతున్నాయి.

అవతల... తన పోర్షనులో నీరజ అభిసారికలా ఎదురు చూస్తోంది. ఆనుదోద్రేకాలతో ఆమె మనసు పరవశించిపోతోంది. కానీ ఆమె ఆశ నిరాశ మాత్రమే అయింది.

కృష్ణమోహన్ తలుపులు మూసి లోపల గడియ పెట్టిన చప్పుడు ఆమెకు పిడుగుపాటులా వినిపించింది.

దిండులో తలదూర్చి వెక్కి వెక్కి ఏడ్చింది. 'ఇంత అందం! ఈ లేత వయసు! అతన్నాకర్షించలేకపోయినయా' అని.

మరుసటిరోజు చింటూ తన గది లోకి వచ్చినపుడు కృష్ణమోహన్ అతన్ని దగ్గరకి తీయలేదు. అతని ముద్దులొలికే కబుర్లకు మురిసిపోలేదు! పైగా ... చింటూని విసుక్కున్నాడు. కసురు కున్నాడు. నీరజ తెచ్చిన కాఫీ, టిఫిన్.... కూరలు నారలు ఏమీ ముట్టనయినా ముట్టలేదు. వాటిని నీరజ పెరటి గుమ్మం దగ్గర పెట్టేశాడు తన నిరసన తెలియ పరుస్తూ. రెండు మూడు రోజులు గడిచేసరికి కృష్ణమోహన్ చిరాకు - విసుగు చాలా ఎక్కువయిపోయాయి. ఒకసారి చింటూ మీద చెయ్యి చేసుకున్నాడు కూడా. నీరజ అగ్నిహోత్రమే అయిపోయింది కృష్ణమోహన్ని చడా మడా తిట్టింది. అయినా చెక్కు చెదరలేదు కృష్ణమోహన్. చిద్విలాసంగా చిరునవ్వు నవ్వేశాడు.

తను గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌లో వస్తున్నట్లు టెలిగ్రాం ఇచ్చింది సత్య ప్రియ.

శ్రీమతిని రిసీవ్ చేసుకోటానికి వెళ్ళబోతూ ఒకసారి పెరటిలోకి వెళ్ళి

"చింటూ" అంటూ ఆప్యాయంగా పిలిచాడు కృష్ణమోహన్.

"చింటూ లేడు.... బంటూ లేడు. వెళ్ళండి!" అంది నీరజ కళ్ళల్లో నిప్పులు కురిపిస్తూ.

చిన్నగా నవ్వాడు కృష్ణమోహన్. ఆ నవ్వులో ఎన్నో అర్థంకాని భావాలు!

"సిగ్గులేకపోతేసరి!పరాయి ఆడదాన్ని చూసి అలా నవ్వటానికి" ఈసడించింది నీరజ.

"శ్రీమతి నీరజగారూ! నన్ను తిట్టండి! మీ నోరు నొప్పిపుట్టేంత వరకూ తిట్టండి! నేనేమీ అనను. అనుకోను. కానీ దయచేసి ఈ చీటీ చదివి చింపివేయండి! అదొక్కటే నా కోరిక! జేబులోంచి చిన్న కాగితం ముక్క తీసి నీరజ చేతిలో పెట్టి గిరుక్కున తిరిగి వెళ్ళిపోయాడు - కృష్ణమోహన్. అందులో ఇలా వుంది.

'ఈ వారం రోజులు.... అంటే .. సత్యప్రియ లేని... ఈ వారం రోజులు మీవారు ఊళ్ళోలేని మీ పాలిట శాపం కాకూడదు. నా పాలిట పీడకల కాకూడదు. దాంపత్యం మధురాతి మధురమైన వరం. మీకు....నేను.... చాటు మాటు ప్రేయసీ.... ప్రియులం కాకూడదు. అదే నా ఆకాంక్ష. అందుకే మీమీద.... చింటూ మీద నిరసన కురిపించింది. సత్యప్రియ రాగానే అంతా మామూలుగానే ఉండాలి! అందుకు మీరు దయతో సహకరించాలి.'

అది చదివిన నీరజ తల తిరిగిపోయింది. తన మీద తనకే ఎంతో అసహ్యం వేసింది. మెతకమనిషి అనుకున్న — కృష్ణమోహన్.... ఎంతో ఉన్నతుడుగా అనిపించాడామెకి. ఎంతో సంస్కారవంతుడిలా కనిపించాడు.

తన తొందరపాటుకి.... అతని ఆవేశం కూడా తోడయివుంటే.... తన గతి ఏమయి వుండేది? కృష్ణమోహన్ కి మనసులోనే నీరాజనా లర్పించుకుంది నీరజ. మరుక్షణంలో ఆ చీటీ ... ముక్కలు .... ముక్కలుగా మారి గాలిలోకి ఎగిరింది.

